## క్లుప్తంగా

### రేపు వెలమ సంఘ కార్తిక వన సమారాధన

సీటీఆర్ఐ: వెలమ సంఘీయుల కార్తిక వన సమారాధన ఈ నెల 10న నామవరం రోడ్డులోని వీరసూర్య అప్పారావు అండ్ సన్స్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు నగర వెలమ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కిలపర్తి శ్రీనివాస్ తెలిపారు. దీనిపై శుక్రవారం స్థానిక మున్సిపల్ స్టేడియం వెనుక ఉన్న గంటా గనిరాజు కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు గోదావరి జిల్లా వెలమ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగర సంఘ గౌరవాధ్యక్షుడు చల్లా శంకరరావు సంయుక్త ఆధ్వర్యంలో వన సమారాధన ప్రారంభమవుతుందన్నారు. పిల్లలకు, మహిళలకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. వన సమారాధన జరిగే ప్రాంతానికి చేరుకునేందుకు నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి 50 బస్సులు ఉచితంగా ఏర్పాటు చేశామన్నారు.

### రేపు శ్రీగౌరీ సంఘం..

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం శ్రీగౌరీ (గవర) సేవా సంఘం వారి కార్తిక వన సమారాధన ఆదివారం ఉదయం 9 గంటలకు బొమ్మూరులోని జీపీఆర్ రోడ్డులోని దండు వెంకట నరసింహరామకృష్ణంరాజు తోటలో జరుగుతుంది. ఈ మేరకు సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బుద్దా రామచంద్రరావు, బొడ్డేడ రాంబాబులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో కుటుంబ సభ్యుల పరిచయ కార్యక్రమం, భోజనాల అనంతరం నూతన కమిటీ ఎన్నిక ఉంటుందన్నారు. గవర సంఘీయులంతా హాజరుకావాలని కోరారు.

### మంగారాణికి అవార్డు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక నాగరాజా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మోటూరి మంగారాణి సామాజిక మాధ్యమ ఉత్తమ ప్రభావశీలి పురస్కారానికి ఎంపికయ్యారు. ఆ వివరాలను శుక్రవారం ఆమె తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎండ్ నౌ డిజిటల్ మీడియా సంస్థ హైదరాబాద్ టి.హబ్‌లో ఈ నెల 17న పురస్కారాన్ని అందజేస్తుందన్నారు. మంగారాణి లెసన్స్ పేరుతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వీడియో పాఠాలు బోధిస్తూ 7.55 కోట్లకు పైగా వీక్షకులను సాధించారు.

### సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రాజమహేంద్రవరం రూరల్: తుపాన్ కారణంగా భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో అరటి, బొప్పాయి, కూరగాయల సాగు రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన శాఖాధికారి డి.సుధీర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తొర్రేడులో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. పొలాల్లో నిలిచిన నీటిని సత్వరమే బయటకు పంపించాలని అన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే 19-19-19 లేదా 13-0-45 వంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలన్నారు. అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలు వేయాలన్నారు. కూరగాయల తోటలో పూర్తిగా నీటిని తీసివేసిన తర్వాత ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటికి రెండు గ్రాములు చొప్పున ప్లాంటమైసిన్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఏబీవీపీ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా సాయి



రాజమహేంద్రవరం సిటీ: ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నగరానికి చెందిన సీఎమ్‌హెచ్ సాయిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఢిల్లీలో జరుగుతున్న ఏబీవీపీ జాతీయ మహాసభల్లో సాయి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు.

### సహజసిద్ధ వ్యవసాయంపై శిక్షణ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వృక్షశాస్త్రం ఆధ్వర్యంలో సహజ సిద్ధమైన వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బీఎస్సీ హార్టికల్చర్ చదువుతున్న విద్యార్థులకు సహజ సిద్ధంగా కూరగాయలు పండించే విధానంపై వివరించారు. కళాశాలలోని 200 గజాల విస్తీర్ణంలో ఎటువంటి రసాయనాలు, ఎరువులు ఉపయోగించకుండా ఆకుకూరలు, కాయగూరలు పండిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు.

### పాలన నిర్వీర్యం

కడియం: పంచాయతీల పాలన నిర్వీర్యం అయ్యిందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆరోపించారు. శుక్రవారం కడియంలో మాజీ ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, నాయకులు వెలుగుబంటి రఘురామ్, ఎం.ప్రసాద్, మార్గాని సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి వాకింగ్

- ఆసక్తి చూపుతున్న ప్రజలు
- వ్యాయామానికి నగర వాసుల ప్రాధాన్యం



పార్కులో నడక దారి పట్టిన వాకర్స్

**ప్రకాశంనగర్: ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు అంటుంటారు. ఆ మాట అక్షర సత్యమని** నమ్మిన ఆరోగ్య అభిలాషులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, జాగింగ్, సైక్లింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరికొందరు యోగా, జిమ్‌లకు వెళ్తున్నారు. అందుకే వీరితో రాజమహేంద్రవరం నగరంలోని క్రీడా మైదానాలు, జిమ్‌లు ఉదయం, సాయంత్రం వేళల్లో కిటకిటలాడుతున్నాయి. ఆర్ట్స్ కళాశాల మైదానం, ఎస్‌కేవీటీ కళాశాల గ్రౌండ్, స్టేడియం ప్రాంతాలతో పాటు వివిధ క్రీడా మైదానాలు, పార్కులు, వాకింగ్ ట్రాక్‌లపై వాకింగ్, జాగింగ్‌లు చేసేందుకు జనం తరలి వస్తున్నారు. వృద్ధులతో పాటు యువతీ యువకులు సైతం ఆయా మైదానాల్లో వ్యాయామం చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు వాకింగ్‌కు వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందని వ్యాయామ ఉపాధ్యాయులు చెబుతున్నారు. రోజుకు 50 నుంచి 70 మంది వరకూ వచ్చే వాకర్స్ ఇప్పుడు 130 నుంచి 150 వరకూ పెరిగారని అంటున్నారు. రోజూ ఒక గంట వ్యాయామంతోశ శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆలోచనా సామర్థ్యం పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**బరువు తగ్గించుకునేందుకు..**

ప్రస్తుత జీవన విధానంలో మారిన ఆహార అలవాట్ల కారణంగా జనాభాలో అధిక శాతం మంది స్థూలకాయ సమస్యతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువతీ యువకులు అధిక బరువు కారణంగా పలు రోగాల బారిన పడుతున్నారు. ఫాస్ట్ ఫుడ్స్, కేక్‌లు, పిజ్జాలు, బర్గర్‌లు వంటి జంక్ ఫుడ్‌లను అధికంగా తినడంతో ఈ సమస్య వస్తోంది. ముఖ్యంగా అధిక బరువుతో బాధపడుతున్న వారు వాకింగ్ ట్రాక్‌లలో పరుగులు తీస్తున్నారు. మరికొందరు గంటల తరబడి వ్యాయామ శాలల్లో వ్యాయామాలు చేస్తున్నారు. ఇంకొందరు యోగా సెంటర్లను ఆశ్రయిస్తున్నారు.

**ఆరోగ్య ప్రయోజనాలివి..**

ప్రతి రోజూ నడకతో బీపీ, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. గుండె జబ్బులు, కొల్రెస్టాల్, కీళ్ల, మోకాళ్ల నొప్పులు, ఆందోళన, మానసిక ఒత్తిడిని దూరం చేయవచ్చు. శరీరక శ్రమతో చిన్నారులను ఆడించడం వల్ల వారిలో ఎదుగుదల, మానసిక పరిపక్వత, ఏకాగ్రత పెరుగుతోంది. మంచి ఆలోచన శక్తి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

> **శ్రద్ధ పెరిగింది**
>
> 
>
> కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆహార అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి విషయాలపై ప్రజలకు ఓ అవగాహన వచ్చింది. ముఖ్యంగా మంచి ఆరోగ్యం కోసం శ్రద్ధ ఎక్కువైంది. ఇది మంచి విషయం. శరీరక శ్రమతో కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం వివిధ రకాల ఆటల పోటీలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తుంది.
>
> –ఏవీడీ ప్రసాదరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు

### అరుణాచలం యాత్రకు 24న ప్రత్యేక బస్సు

రాజమహేంద్రవరం సిటీ: అరుణాచలం యాత్రకు వెళ్లే భక్తులకు ఈ నెల 24న రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని, దీనిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ షేక్ షబ్నం విజ్ఞప్తి చేశారు. ఈ యాత్రలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకోవచ్చన్నారు. తిరుగు ప్రయాణంలో కంచి, శ్రీకాళహస్తి పుణ్య క్షేత్రాలను దర్శించుకునే అవకాశం ఉందన్నారు. ఒక్కో టిక్కెట్ ధర రూ.3,200గా నిర్ణయించామన్నారు. దీనికి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో టిక్కెట్లు ఇస్తామన్నారు. పూరి జగన్నాథ్ రథయాత్రకు శుక్రవారం రెండు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు గుమ్మళ్లదొడ్డి గ్రామం నుంచి వెళ్లాయని తెలిపారు. శబరిమలై యాత్రకు రాజమహేంద్రవరం డిపో నుంచి 9, 11, 14 తేదీల్లో బస్సులు బయలు దేరనున్నాయన్నారు. ఏయాత్రకైనా వెళ్లే భక్తులు స్థానిక డిపోలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్ 99592 25535, అసిస్టెంట్ మేనేజర్ 73829 12141 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### అధికారుల తనిఖీలు

కంబాలచెరువు: పాన్ ఇండియా చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రాజమహేంద్రవరం అర్బన్, రాజానగరం మండలంలోని వ్యాపార సంస్థల్లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ యం.లలిత శుక్రవారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి ప్రారంభించారు. అధికారులు హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, పెట్రోల్ బంకులు, భవన నిర్మాణాల్లో బాల కార్మికులు పని చేస్తున్నారా అనే దానిపై తనిఖీలు చేశారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని వ్యాపార సంస్థల యజమానులకు సూచించారు. తనిఖీల్లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎ.వి జయప్రకాష్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ జి.స్వాతి, రాజమహేంద్రవరం దిశా ఇన్‌స్పెక్టర్ రమణి, ఏఎస్సై రమా సత్యనారాయణ, కానిస్టేబుల్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

### కాంట్రాక్టు సిబ్బంది నిరసన

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు– ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బొమ్మూరు సెంటర్లో ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వరకూ ర్యాలీగా వెళ్లి కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం సమర్పించారు. సంఘ జేఏసీ కోఆర్డినేటర్ బి.వంశీకృష్ణంరాజు, సీఆర్‌పీఎం రఘునాథ్ మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

## వన సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న గుబ్బల రాంబాబు, అజ్జరపు వాసు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం జరిగే మన చైతన్య వన సమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వేదిక చైర్మన్ గుబ్బల రాంబాబు, కన్వీనర్ అజ్జరపు వాసు పిలుపునిచ్చారు. నగరంలోని చెరుకూరి గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మన చైతన్య వన సమ్మేళనం ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్, తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ జి.జానకి షర్మిల, అడిషనల్ ఎస్పీ పి.సోమశేఖర్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకృష్ణ, ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాద్‌రావు, ఏపీ ఈపీడీసీఎల్ జనరల్ మేనేజర్ కుమార్, ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి సామ్యూల్, డిప్యూటీ చీఫ్ కంట్రోల్ ఆఫ్ అకౌంట్స్ వీడీ సర్వేశ్వరరావు, ఏపీ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లజామ్, ప్రజా గాయకుడు షాన్ రేంజర్ల రాజేష్ పాల్గొంటున్నారని తెలిపారు. సమావేశంలో ఐక్యవేదిక ఆహ్వాన కమిటీ సభ్యులు కొంతమూరు చానా, యాదల సతీష్ చంద్రస్టాలిన్, బొర్రా చిన్ని, భాను ప్రకాష్, తురకల నిర్మల, వారా రాము, కోరుకొండ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



మందులను పంపిణీ చేస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సత్యగోవింద్, శ్యాంబాబు

రాజమహేంద్రవరం రూరల్: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి టి.సత్యగోవింద్ అన్నారు. శుక్రవారం రాజవోలులో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ మాజీ సభ్యుడు నక్కా శ్యాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యగోవింద్ మాట్లాడుతూ 136 పశువులకు టీకాలు వేశామని, 122 పశువులు, 60 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేసి, వైద్య సేవలు అందించామన్నారు. పశుసంవర్ధక శాఖ నగర ఉపసంచాలకులు ఎం.వెంకటేశ్వర్లు, అనపర్తి అసిస్టెంట్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, మండల పశువైద్యాధికారి పి.వెంకటరావు, వైద్యులు కె.సౌమ్య, జ్యోత్స్న పాల్గొన్నారు.

## సారా బట్టీలపై దాడులు



నిందితులు, స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎస్ఈబీ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ

రాజమహేంద్రవరం రూరల్/రాజానగరం: రాజానగరం మండలం చక్రద్వారబంధంలో శుక్రవారం సారా బట్టీలపై విస్తృతంగా దాడులు నిర్వహించామని ఎస్ఈబీ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. ఈ దాడుల్లో ఆ గ్రామానికి చెందిన మట్టా మణికంఠ, సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తున్న కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన కుంపట్ల కృష్ణను అరెస్టు చేశామన్నారు. 105 లీటర్ల సారా, 80 కిలోల బెల్లం, రెండు సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్, గ్యాస్ సిలిండర్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 800 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామన్నారు.

**వ్యక్తి అరెస్ట్**

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరం నుంచి రాజమహేంద్రవరానికి సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసి, 50 లీటర్ల సారా, ఓ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. ఈ మేరకు వెంకటనగరం గ్రామానికి చెందిన పాము కృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో కొల్లపు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

## రేపు ఏపీ డయాబెటిస్ జాతీయ సదస్సు

**హాజరుకానున్న 26 మంది వైద్య నిపుణులు**



సదస్సు వివరాలను తెలుపుతున్న వైద్యులు కందుల సాయి, వడ్డాది సురేష్ తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ డయాబెటిస్ జాతీయ సదస్సుకు రాజమహేంద్రవరం వేదిక కానుందని సదస్సు నిర్వాహకులు, ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు, డాక్టర్లు కందుల సాయి, వడ్డాది సురేష్, ఎస్.రామచంద్ర, కందుల సాయి సుమంత్ తెలిపారు. స్థానిక రివర్‌బేలో 10 నుంచి 12వ తేదీ వరకూ ఈ సదస్సు జరుగుతుందన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సదస్సుకు అంతర్జాతీయంగా ప్రఖ్యాత గాంచిన 26 మంది వైద్య నిపుణులు వస్తున్నారన్నారు. మధుమేహ నివారణ, నూతన విధానాలు, గర్భిణులు, పిల్లల్లో వచ్చే మధుమేహ చికిత్సలపై సదస్సులో చర్చిస్తారన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు వెయ్యి మంది వైద్యులు, వైద్య విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇప్పటివరకూ విజయవాడ, కర్నూలు, గుంటూరు వంటి ప్రాంతాల్లోనే రాష్ట్ర సదస్సులు నిర్వహించారన్నారు. మారుతున్న పరిస్థితుల్లో చిన్నపిల్లల్లో సైతం మధుమేహ లక్షణాలు వెలుగు చూస్తున్నాయన్నారు. అదే సమయంలో మధుమేహ వ్యాధికి సంబంధించి ఎప్పటికప్పుడు ఆధునిక చికిత్సా పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. దీనిపై వైద్య నిపుణులు వివరిస్తారన్నారు.

## వైభవంగా దర్గా గంధోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఇన్నీసుపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సమీపాన ఉన్న హజరత్ సయ్యద్‌షా ఖకార్షా వలీ బాబా దర్గాలో శుక్రవారం గంధోత్సవం నిర్వహించారు. దర్గా కమిటీ ఆర్గనైజర్ షేక్‌అల్లాభక్షి ముజావర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి జెండాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబా సమాధి వద్దకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఖకార్షా దర్గా నుంచి గంధం కలిగిన బిందెను ఊరేగింపుగా కోటిపల్లి బస్టాండ్, వీటీ కళాశాల రోడ్, తాడితోట మీదుగా గోరక్షణపేటలో ముజావర్ ఇంటికి తీసుకువెళ్లారు. అక్కడ ఫకీర్‌లు తత్వం నిర్వహించిన అనంతరం దర్గాకు చేరుకుంది.

## అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం

**వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్**



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధురాలిని పలకరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక 7వ డివిజన్‌లో పార్టీ డివిజన్ ఇన్‌చార్జి గౌస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయకులతో ఇంటింటికీ వెళ్లి స్థానికులను కలుసుకుని ప్రభుత్వ పథకాలను వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కేటాయించిన రూ.125 కోట్లతో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి సచివాలయానికి రూ. 20 లక్షల చొప్పున కేటాయించారన్నారు. ఈ నిధులతో ప్రాధాన్య క్రమంలో పనులు చేపడుతున్నామన్నారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నాయకులు అరిపుల్లా ఖాన్, సయ్యద్ అల్తాఫ్, ఖాజా, సచివాలయ అడ్మిన్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



దివ్యాంగులకు కేక్ తినిపిస్తున్న కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను

ధవళేశ్వరం: దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద పోసికుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. దివ్యాంగులు, వృద్ధులకు అన్నదానం చేశారు. పోసికుమార్ మాట్లాడుతూ మూడు చక్రాల మోటారు సైకిళ్లు, కల్యాణమస్తు పథకంలో దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, దివ్యాంగుల రక్షణ చట్టం 2016ను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దివ్యాంగులకు అండగా ఉంటూ సేవలందిస్తున్నారు. పార్టీ దివ్యాంగుల విభాగం నాయకులు కేవీఆర్ సాగర్, బసనబోయిన దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశంనగర్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి దివ్యాంగులకు స్వీట్లు పంచారు. అను మాట్లాడుతూ దివ్యాంగులకు బ్యాటరీ స్కూటర్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం స్కూటర్ల ర్యాలీ చేశారు. రాష్ట్ర కార్యదర్శి లింగం రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి ఆదిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శివ, బ్రహ్మాజీ, కృప, దుర్గ, బొంతు శ్రీను పాల్గొన్నారు.

## క్రీడా పోటీలు ప్రారంభం



ఇండోర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజినల్ మీట్ 2023–24 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా రాజమహేంద్రవరం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో బాలుర విభాగంలో బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహించారు. శనివారం బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

### ● ఆకట్టుకున్న కార్తిక దీపోత్సవం



బుర్రిలంకలో శివలింగాకారంలో దీపాలంకరణ

కడియం: బుర్రిలంకలోని శ్రీలక్ష్మీరత్న గణపతి స్వామివారి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి కార్తిక దీపోత్సవం ఆకట్టుకుంది. ఆలయ కమిటీ, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని దీపాలు వెలిగించారు. శివ లింగాకారం, శంఖు చక్రాల ఆకృతుల్లో దీపాలంకరణ చేశారు.

### వైభవంగా లక్ష బిల్వార్చన



ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వర స్వామివారు

ధవళేశ్వరం: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన, విఘ్నేశ్వర పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం లక్ష బిల్వార్చన, మహిళలచే సామూహిక లక్ష కుంకుమార్చన, లలితా పారాయణ జరిగింది. సాయంత్రం రుద్రహోమం, సూర్యనమస్కారాలు, జ్యోతిర్లింగార్చన, ఆకాశ దీపారాధన, ధూప ప్రాకార సేవ, స్వామివారికి శాంతి కల్యాణం, పండిత సత్కారం, రాత్రి నీరాజ మంత్ర పుష్పాలు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళంపల్లి చంద్రశేఖరశాస్త్రి, ఆలయ అర్చకులు విశ్వనాథశర్మ, నరసింహమూర్తి ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


### కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు

ధవళేశ్వరం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దర్శించుకున్నారు. ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. టీడీపీ నాయకుడు సావాడ శ్రీనివాసరెడ్డి సమకూర్చిన 5 సిమెంట్ బెంచీలను ఆలయానికి బహూకరించారు. 20 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నాయకులు మజ్జి పద్మ, పిల్లా తనూజ, యర్రమోతు ధర్మరాజు, పిన్నింటి ఏకబాబు, పందూరి అప్పారావు, ఆళ్ల ఆనందరావు పాల్గొన్నారు.

### తెలుగు మహాసభలను విజయవంతం చేద్దాం

రాజానగరం: మన భాష, మన యాసలను మర్చిపోతున్న ఈ రోజులలో ప్రాచీన తెలుగు భాష గొప్పదనాన్ని, సంస్కృతిని వెలుగులోకి తీసుకువచ్చేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల 5, 6, 7 తేదీలలో నిర్వహించనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల నిర్వహణపై గైట్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం సన్నాహక సమావేశం జరిగింది.

### సినిమాలు



| | |
|---|---|
| శ్యామల | : యానిమల్ |
| సూర్యమినీ | : యానిమల్ |
| సూర్యప్యాలెస్ | : హాయ్ నాన్న |
| స్వామి | : హాయ్‌నాన్న |
| శివజ్యోతి | : ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |
| అనుశ్రీ | : హాయ్ నాన్న |
| రాజా | : హాయ్ నాన్న |
| అశోక | : ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |
| ఊర్వశి | : కోటబొమ్మాళి పీఎస్ |
| రంభ | : మంగళవారం |
| మేనక | : చాందిక |
| అప్సర | : ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |
| **నామవరం** | |
| వీఎస్ మహల్ | : హాయ్ నాన్న, ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |
| **ధవళేశ్వరం** | |
| మురళీకృష్ణ | : హాయ్ నాన్న, ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |
| **కడియం** | |
| వెంకటసూర్య | : హాయ్ నాన్న, ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్ |